ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 12 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళ) సా.6.21
సహరి (బుధ) ఉ.4.52



అర్జీదారుని సమస్య వింటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

గడువు దాటక ముందే అర్జీలను పరిష్కరించాలి

» కలెక్టర్ హిమాన్షు శుక్లా » 'స్పందన'లో 245 అర్జీల స్వీకారం

అమలాపురం టౌన్, మార్చి 11: నిర్దేశిత గడువు దాటకముందే అర్జీదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'స్పందన' నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ రుణాలు, పెన్షన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, సామాజిక సమస్యలతో పాటు భూ వివాదాలు వంటి అంశాలపై 245 అర్జీలను అందజేశారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అర్జీలు స్వీకరించారు.



పేదల ఇళ్ల మీదుగా రైల్వేలైన్ వద్దు

మేడిచర్లపాలెం గ్రామస్తుల ధర్నా

పేదల ఇళ్ల మీద నుంచి రైల్వే లైన్ వేయరాదని మలికిపురం మండలం మేడిచర్లపాలెం గ్రామస్తులు సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రైల్వే లైన్ వేయడానికి సర్వే చేస్తున్నారని, తద్వారా శివకోడు, మేడిచర్లపాలెం, దిండి గ్రామాల్లో సుమారు వంద గృహాలు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న భూముల మీదుగా రైల్వే లైన్ వేయాలని రాజేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో పేదల ఇళ్లకు నష్టం కలిగితే చూస్తూ ఊరుకోమని బాధితులను, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. మా ఇళ్ల మీదుగా రైల్వే లైన్ వేస్తే ఆత్మహత్యలే శరణ్యమని మహిళలు హెచ్చరించారు. ధర్నా అనంతరం స్పందనలో అర్జీ అందజేశారు. సామాజిక హక్కుల వేదిక మండల శాఖ అధ్యక్షుడు రాపాక రత్నరాజు, పెచ్చెట్టి సింహాద్రి, మేడిచర్ల సత్తిబాబు, గుబ్బల సత్యనారాయణ, మేడిచర్ల చాణుక్య, రాపాక విశాలాక్షి, ఆర్.కాంచన, రాపాక కుటుంబరావు, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.




తొలకరి ధాన్యం సొమ్ములు చెల్లించి ఆదుకోండి

ధాన్యం అమ్మిన ఇరవై రోజుల్లో సొమ్ములు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. 54 రోజులు గడిచినా ఇంతవరకు సొమ్ములు జమ కాలేదు. అయినవిల్లి, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాలకు చెందిన రైతులు తొలకరిపంట ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా విక్రయించగా సుమారు రూ.2 కోట్ల మేర బకాయిలను ప్రభుత్వం ఇప్పటిదాకా విడుదల చేయలేదు. స్పందనలో వరుసగా ఫిర్యాదులు చేస్తున్నా స్పందించట్లేదు. పౌరసరఫరాల శాఖ అధికారులను కలిసి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. తక్షణం సొమ్ములు చెల్లించి ఆదుకోవాలి. రెండో పంటను అప్పులు చేసి వేశాం. వాటికి వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాకిలేటి భాస్కరరావు, గుర్రం సీతారత్నం, కాకిలేటి దుర్గారావు, రావూరి ప్రభాకరరావు, రావూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పూర్తి చేయండి మహాప్రభో

నడిపూడి గ్రామ మహిళల నిరసన



ఈదరపల్లి మెయిన్ రోడ్డు నుంచి నడిపూడి మెట్ల రాంజీ కాలనీ వరకు సుమారు రూ.95 లక్షలతో రోడ్డు మంజూరు అయ్యింది. పనులు చేపట్టి కంకర చిప్స్‌వేసి వదిలేశారు. రోడ్డుపై నడిచి వెళ్లాలంటే ఇబ్బందిగా వుంది. రెండేళ్లుగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి రోడ్డు నిర్మాణం పూర్తిచేసి ఆదుకోవాలని ఉప్పుగంటి మల్లేశ్వరి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహిళలు నిరసన తెలిపి అర్జీ అందించారు.

సబ్ ప్లాన్ నిధులతో షెడ్డు నిర్మించండి

శెట్టిబత్తుల తులసీదుర్గారావు



పూర్వీకుల కాలం నుంచి గోడిలంకలో శ్మశానవాటిక స్థలం లేదు. ఇటీవల కలెక్టర్ కృషి వల్ల శ్మశానవాటికకు స్థలం ఇచ్చారు. అయితే దహన కార్యక్రమాలు నిర్వహించుకోవడం అక్కడ ఇబ్బందికరంగా మారింది. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు వెచ్చించి శ్మశానవాటికలో షెడ్డు నిర్మించాలి.

ఒంటరి మహిళలకు ఇళ్ల స్థలాలు ఇప్పించండి

గోడిలంక ఒంటరి మహిళలు



పుట్టింట్లో కొందరం,. అద్దె ఇళ్లలో మరికొందరం ఒంటరిగా జీవిస్తున్నాం. ఇళ్ల స్థలాల కోసం సచివాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేదు. ఏ ఆధారం లేని తమకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని పోతుల వరలక్ష్మి, సరెళ్ల నాగలక్ష్మి, ఉప్పే మీరాబాయి తదితరులు అర్జీ అందించారు.

రేషన్ కార్డు ఇప్పించండి

మల్లాడి భైరవమూర్తి దంపతులు, కొత్తలంక



రేషన్‌కార్డు కోసం రెండేళ్లుగా తిరుగుతున్నాం. అది లేక ఏ ప్రభుత్వ పథకం అందట్లేదు. నిరుపేద మత్స్యకార కుటుంబానికి చెందినవారం. రేషన్‌కార్డు అందించి లబ్ధి చేకూర్చండి.

వితంతు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నా...

రాకుర్తి రామతులసి, నల్లా వీధి, అమలాపురం



భర్త చనిపోయి ఐదేళ్లు అవుతోంది. వితంతు పెన్షన్ కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇవ్వట్లేదు. నా భర్త డెత్ సర్టిఫికెట్ కూడా అందజేశాను. విచారణ జరిపి వితంతు పెన్షన్ మంజూరు చేయండి.

» మాజీ మంత్రి గొల్లపల్లికి వ్యతిరేకంగా సఖినేటిపల్లి మూడు తూముల వద్ద రోడ్డెక్కి వైసీపీ శ్రేణుల నిరసన
» రాపాకకే రాజోలు సీటు కేటాయించాలని ఆందోళన
» ఇరువర్గాల మధ్య ముదురుతున్న వైరం



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న దృశ్యం

వైసీపీలో అసమ్మతి జ్వాల

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కోనసీమ జిల్లా రాజోలు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ వైసీపీలో రాజకీయ అసమ్మతి జ్వాలలు రగులుతున్నాయి. సాక్షాత్తూ ఆ పార్టీకి చెందిన కార్యకర్తలే రోడ్డెక్కి వైసీపీకి వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును నియమించడాన్ని నిరసిస్తూ వైసీపీలోని కార్యకర్తలు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. 'సిద్ధం' ఫ్లెక్సీలను సైతం తొలగించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా సిటింగ్ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును కొనసాగించాలంటూ ఆందోళనలు మొదలయ్యాయి. రాజోలుకు చెందిన రాపాక వరప్రసాదరావును అమలాపురం లోక్‌సభ సమన్వయకర్తగాను, గొల్లపల్లి సూర్యారావును రాజోలు అసెంబ్లీ సమన్వయకర్తగాను నియమిస్తూ మూడు రోజుల క్రితం ఆ పార్టీ అధినేత ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాజోలు నియోజకవర్గంలోని వైసీపీలో రసవత్తర రాజకీయాలు నెలకొన్నాయి. ఆ పార్టీకి చెందిన నియోజకవర్గస్థాయి సోషల్ మీడియా నేతలు సైతం తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు అధికారింగా లేఖలు విడుదల చేశారు. ఈ నియోజకవర్గంలో చోట చేసుకున్న తాజా రాజకీయ పరిణామాలతో కలత చెందిన తాము వైసీపీని వీడాల్సి వస్తుందంటూ సోషల్ మీడియా నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న కరుడుగట్టిన వ్యక్తులు పేర్కొంటున్నారు.

రాజోలు వైసీపీలో నెలకొన్న పరిస్థితులపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వైసీపీ ఎమ్మెల్యేల్లో అసంతృప్తి శీర్షికన కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు రాపాకకు రాజోలు అసెంబ్లీ టిక్కెట్‌నే కేటాయించాలనే డిమాండుతో సఖినేటిపల్లి మూడు తూముల వద్ద వైసీపీ పార్టీ శ్రేణులు మోకాళ్లపై ఆందోళనకు దిగి నిరసన వ్యక్తం చేశారు. పార్టీ తమ మనోభావాలను గుర్తించకపోతే తామంతా వైసీపీని వీడాల్సి వస్తుందంటూ హెచ్చరించారు. గొల్లపల్లికి వ్యతిరేకంగా జరిగిన ఈ ఆందోళన వెనుక సిటింగ్ ఎమ్మెల్యే, లోక్‌సభ సమన్వయకర్త రాపాక వరప్రసాదరావు హస్తం ఉండవచ్చని గొల్లపల్లి వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే వైసీపీలోని ఇరు వర్గాలకు చెందిన నేతలు సోషల్ మీడియా వేదికగా గతంలో ఒకరిపై ఒకరు చేసుకున్న అవినీతి, అక్రమాల ఆరోపణలు, అసభ్యంగా తిట్టుకున్న వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వారిద్దరూ సయోధ్య ప్రకటించుకున్నప్పటికీ అంతర్గత పోరుకు వైసీపీలోని ఇరువర్గాల వారు ఆజ్యం పోస్తున్న తీరు చర్చనీయాంశమైంది. రానున్న రోజుల్లో అది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇదిలా వుండగా రాజోలు నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలను వైసీపీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు.

'గొల్లపల్లి సూర్యారావు నాయకత్వం మాకొద్దు'

అంతర్వేది, మార్చి 11:
నాలుగు సంవత్సరాలు కష్టపడి గడపగడపకు తిరిగి ప్రజల కష్టాలు తెలుసుకున్న నాయకుడే రాజోలు ఎమ్మెల్యే కావాలి. నిన్నకాక మొన్న పార్టీలో చేరిన వారు అభ్యర్థి కాలేరని గొల్లపల్లి సూర్యారావుపై వైసీపీ నాయకులు నిప్పులు చెరిగారు. ఎమ్మెల్యే టిక్కెట్టు గొల్లపల్లికి వద్దంటూ కుసుమ చింటూ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు సఖినేటిపల్లి మూడు తూముల వద్ద పలువురు మోకాళ్లపై కూర్చున్నారు. సిద్ధం సభ కోసం ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను సైతం తీసివేసి వినూత్న రీతిలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రాజోలు గడ్డ రాపాక అడ్డా... ఆయనకే టిక్కెట్టు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. గొల్లపల్లి సూర్యారావుకే టిక్కెట్టు ఇస్తే 175 స్థానాలకు 174 వైసీపీ ప్రభుత్వం నికరం చేసుకోవాలని, గొల్లపల్లిని ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఘంటాపథంగా తెలిపారు. సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల్లో గత వైసీపీ నాయకులు ఎంతమందిని గొల్లపల్లి సూర్యారావు కలిసినా ఉపయోగం లేదని హెచ్చరించారు. రాపాకకే ఎమ్మెల్యే టిక్కెట్టు కేటాయించాలని, గొల్లపల్లి నాయకత్వంలో పనిచేసేది లేదని... వైసీపీ సభ్యత్వానికి సైతం రాజీనామా చేయడానికి సిద్ధపడ్డారు. కార్యక్రమంలో కుసుమ రాకేష్ (చింటూ), రాహుల్, నల్లి ప్రకాష్, కొల్లాబత్తుల నెహేమియా, మీరా షరీఫ్, సుభాకర్, మేడిద రమేష్, షేక్ అన్వర్, ఏలియా, గొల్లమందల ప్రవీణ్, మోకా దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాతవి చెల్లించినా కొత్తవి ఇవ్వట్లేదు

» రుణాలు సకాలంలో చెల్లించినా మళ్లీ ఇవ్వట్లేదంటూ ఎస్‌బీఐ అధికారుల తీరుపై మండిపాటు
» 'చేయూత' సభలో జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబులను నిలదీసిన డ్వాక్రా మహిళలు
» వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంతో వాగ్వాదం

అంబాజీపేట, మార్చి 11: ఎన్నికలు వచ్చినప్పుడు మహిళల ఓట్లు కావాలి... కానీ మా సమస్యలను పట్టించుకోరా అంటూ అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన నాల్గవ విడత 'చేయూత' సభకు హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులను కె.పెదపూడికి చెందిన డ్వాక్రా మహిళలు నిలదీశారు. తాము అంబాజీపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డ్వాకా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించామన్నారు. లోన్లు చెల్లించి సుమారు ఐదు నెలలైనా బ్యాంకు అధికారులు కొత్త రుణాలు మంజూరు చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పూర్తిస్థాయిలో చెల్లించామని, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై మాట్లాడమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావుకు ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ అప్పగించారు. సభ జరిగిన అనంతరం మహిళలతో ఎంపీపీ వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి చర్చించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం గంగాధర్‌తో ఈ విషయమై మాట్లాడారు. నాలుగు నెలలుగా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా రుణాలు ఎందుకు ఇవ్వట్లేదని మహిళలు ప్రశ్నించారు. స్టేట్ బ్యాంకు అధికారులు కొంతమంది మహిళల పట్ల ఇబ్బందికరంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. గ్రామంలోని డ్వాక్రా సంఘాలకు తక్షణం రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే బ్యాంకు, డ్వాక్రా కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీపీ, జడ్పీటీసీ డ్వాక్రా మహిళలకు హామీ ఇచ్చారు. అనంతరం 4,129 మంది లబ్ధిదారులకు రూ.7.74 కోట్ల చెక్కును జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మహిళలకు అందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైస్ చైర్మన్ నేతల నాగరాజు, సుదాబత్తుల లక్ష్మీభార్గవి, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, ఏపీఎం గంగాధరరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో బి.మమత, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో ఏపీఎంతో వాగ్వివాదానికి దిగుతున్న డ్వాక్రా మహిళలు



నిరీక్షణ

» హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ జాయినింగ్ ఆర్డరు ఇచ్చినా చేరికకు అనుమతి ఇవ్వని కలెక్టర్ అనుమతి
» ఐదు రోజులుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న హౌసింగ్ పీడీ కూర్మినాయుడు

ముమ్మిడివరం, మార్చి 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా హౌసింగ్ పీడీగా వి.కూర్మినాయుడును నియమిస్తూ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఈ నెల 6న ప్రొసీడింగ్ ఆర్డర్ ఇచ్చింది. జాయినింగ్ అనుమతి కోసం కలెక్టర్ వద్దకు వెళ్లిన ఆయనకు లభించలేదు. కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మధుసూదన్ హౌసింగ్ అదనపు పీడీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన ముమ్మిడివరం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కూడా కొనసాగుతున్నారు. విజయవాడ ఏపీ ఎస్‌హెచ్‌సీఎల్ ఎస్ఈగా పనిచేస్తున్న కూర్మినాయుడును శ్రీకాకుళం జిల్లా హౌసింగ్ పీడీగా పోస్టింగ్ చూపుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పీడీగా నియమిస్తూ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ కె.వెంకటరమణారెడ్డి ఉత్తర్వులిచ్చి కలెక్టర్‌ను జాయిన్ చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. అయితే ఐదు రోజులుగా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తనకు చేరికకు అనుమతి ఇవ్వడం లేదని కూర్మినాయుడు 'ఆంధ్రజ్యోతి' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీని వెనుక రాజకీయ లేక ఏ ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే చర్చ జరుగుతోంది.

నా వెంట లేకుంటే... 'భరోసా' లేనట్టే!

» మత్స్యకారులకు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ హెచ్చరిక



ముమ్మిడివరం, మార్చి 11: ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు వైసీపీ టిక్కెట్ ఖరారు కావడంతో నియోజకవర్గంలోని సుమారు 48వేల మత్స్యకార ఓట్లపై గురిపెట్టారు. మత్స్యకారుల్లో కొంతమంది టీడీపీ, జనసేన వైపు మొగ్గుచూపగా వారిని వైసీపీవైపు లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారు. మత్స్యకార భరోసా ఎరగా చూపుతూ వైసీపీ వైపే ఉండాలని కోరుతున్నారు. ఒకవేళ ఎవరైనా వ్యతిరేకంగా పనిచేస్తే వారికి మత్స్యకార భరోసా కటింగ్ అవుతుందని హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ముమ్మిడివరంలో 'మత్స్యకారభరోసా' సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తాను రాజకీయాలకు అతీతంగా అగ్నికుల క్షత్రియులందరికీ మేలు చేస్తూ వచ్చానన్నారు. ఈసారి తన పక్షాన నిలవకపోయిన వారిని పక్కనపెట్టి తన వర్గీయులకు మాత్రమే సాయం అందిస్తానని హెచ్చరికలు జారీ చేశారు. తననే గెలిపిస్తే మేలు జరుగుతుందని, లేకపోతే నష్టపోతారన్నారు.



తాయిలాల పర్వం

» మహిళలకు చీరలు పంపిణీ చేసిన కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
» రావులపాలెంలో వేర్వేరు చోట్ల మహిళా దినోత్సవం పేరిట ప్రలోభాలు... 7లో

చింతలూరు నూకాంబికా ఉత్సవాలకు శ్రీకారం



బుట్ట గరగ ఊరేగింపును ప్రారంభిస్తున్న చైర్మన్, ఈవో

ఆలమూరు, మార్చి 11: ఉభయ గోదావరి జిల్లాల్లో పేరుగాంచిన అమ్మవారి జాతర్లలో ఒకటైన చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతర ఉత్సవాలు బుట్ట గరగతో సోమవారం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం ఆలయ అర్చకులు అమ్మవారి బుట్ట గరగకు ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత గరగను చింతలూరి వారి ఇంటికి తీసుకెళ్లి పసుపు, కుంకుమ స్వీకరించారు. అనంతరం మహిళలు పసుపు నీళ్లతో అమ్మవారిని స్వాగతించి పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో బుట్ట గరగను 15 రోజులు ఊరేగిస్తారు. అనంతరం 15 రోజులు కొత్త, పాత పూల ఉత్సవాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 7న జాతర, 8న తీర్థం, 9న ఉగాది జరుగుతాయని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, కార్యనిర్వహణాధికారి మద్దూరి శ్రీరామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు, జేపీ భాస్కర్‌శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



బుట్ట గరగను దర్శించుకుంటున్న చింతలూరి కుటుంబీకులు

రాయవరం మండలం చెల్లూరు శివారు ఎర్రమట్టిపురంలో

పీడీఎస్ బియ్యం స్వాధీనం

దోపిడీ కేసులో నాలుగేళ్ల శిక్ష

....వివరాలు 7లో

'ఎండిపోతున్న వరి చేలకు సాగునీరు అందిస్తాం'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అంబాజీపేట, మార్చి 11: నీటి ఎద్దడి కారణంగా ఎండిపోతున్న వరి చేలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ జేఈ నవీన్‌కుమార్ తెలిపారు. 'నోళ్లు తెరుస్తున్న వరి చేలు' శీర్షికన ఫిబ్రవరి 23న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పందించారు. పంట కాల్వను శుభ్రం చేసేందుకు రూ.లక్ష మంజూరు చేశారు. వీటిలో రూ.48వేలతో కె.పెదపూడి, పసువల్లి, గంగలకుర్రు ఛానల్‌కు వెళ్తున్న పంట బోదెలను శుభ్రం చేసి శివారు ప్రాంతాలకు సాగునీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని జేఈ తెలిపారు. సాగునీటి ప్రవాహం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పిఠాపురం ఆర్వో నియామకంపై దుమారం

ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య

తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన జనసేన

నిబంధనలు పాటించలేదని రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు

సీఈసీ ఆదేశాలతో పశ్చిమగోదావరికి బదిలీ

పిఠాపురం, మార్చి 11: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కాకినాడ జిల్లా జేసీని ప్రవీణ ఆదిత్య నియామకం రాజకీయ దుమారం లేపింది. ఆయన నియామకంలో నిబంధనలు పాటించలేదనే ఆరోపణలతో, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు జనసేన ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను పశ్చిమగోదావరి జేసీగా బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం ఉన్న నేపథ్యంలో ఇక్కడి ఎన్నికలను అధికార వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పవన్ పోటీ చేస్తే ఎలాగయినా ఓడించాలని ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకుగాను తమకు అనుకూలమైన అధికారులు నియోజకవర్గ పరిధిలో ఉండేలా అధికార వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే రంపచోడవరం ఐటీడీఏ పీవోగా, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేసిన ప్రవీణ ఆదిత్యను జిల్లా జాయింట్ కలెక్టరుగా నియమించడంతోపాటు పిఠాపురం అసెంబ్లీ ఆర్వో బాధ్యతలు అప్పగించడంపై జనసేన పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, లీగల్‌సెల్ ఛైర్మన్ సాంబశివ ప్రతాప్, కార్యదర్శి కోటేశ్వరరావు అమరావతిలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. ఉమ్మడి జిల్లాలోనే నాలుగేళ్లకు పైగా విధులు నిర్వర్తించిన అధికారిని ఇక్కడ ఎలా నియమిస్తారని వారు ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా జేసీగా, పిఠాపురం ఆర్వోగా నియామకం జరిగిందని వారు ఫిర్యాదులో తెలిపారు. అధికార పార్టీ నేతలతో ఆయనకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. తక్షణం ఆయన్ను ఆర్వో బాధ్యతలనుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. మరోవైపు పిఠాపురం నియోజకవర్గంలో ఫారం-7 తప్పుడు దరఖాస్తుల ద్వారా ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన అధికారులు దరఖాస్తుల్లో వాస్తవం లేదని తేలడంతో అధికార వైసీపీకి చెందిన పలువురు నేతలపై పోలీసు కేసులు నమోదయ్యాయి.

అంతా రహస్యమే

పిఠాపురం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియమితులైన జేసీ ప్రవీణ్ ఆదిత్య వ్యవహారశైలిని పలువురు తప్పుబట్టారు. ఆర్వోగా నియమితులైన తర్వాత ఆయన పిఠాపురంలో నిర్వహించిన సమావేశాలకు సంబంధించి మీడియాకు సమాచారం లేకుండా గోప్యంగా నిర్వహించడాన్ని టీడీపీ, జనసేన నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, సమావేశాలు అందరికి తెలియాల్సి ఉండగా, గోప్యంగా ఉంచడం ఎందుకని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా జేసీ ప్రవీణ్ ఆదిత్యపై బదిలీ వేటు పడింది. జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధుల్లో చేరిన కొద్ది నెలల్లోనే ఆయన్ను పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ చేశారు. ఆ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా జేసీగా ఉన్న ఎస్.రామసుందరెడ్డిని జిల్లా జేసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సినిమాల ద్వారా తెలుగు సాహిత్యానికి పెద్దపీట



మాట్లాడుతున్న మీర్ అబ్దుల్లా

పోర్టుసిటీ(కాకినాడ), మార్చి 11: సినిమా ద్వారా తెలుగు సాహిత్యానికి పెద్ద పీట వేయాలని పడమట సంధ్యారాగం చిత్ర సహ నిర్మాత, సినీ నటుడు మీర్ అబ్దుల్లా అన్నారు. ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన పడమటి సంధ్యారాగం చిత్రానికి సహ నిర్మాతగాను, హీరోయిన్ చిన్నాన్న పాత్రలోను నటించానన్నారు. పూర్తి గ్రామీణ వాతావరణంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా పడమటి సంధ్యారాగం రెండో భాగానికి . దర్శకత్వం వహిస్తున్నానని చెప్పారు. వర్ధమాన నటీనటులతో చిత్రం రూపొందిస్తున్నానని, కథ సిద్ధమైందని తెలిపారు. ఈ వారంలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వస్తుందని చెప్పారు. పడమటి సంధ్యారాగం చిత్రంలో జాతి, మత, ప్రాంతీయ సామరస్యం అంతర్లీనంగా ఉంటుందని, ఇప్పుడు తీస్తున్న రెండో భాగంలో అన్ని అంశాలు మిళితమై ఉంటాయన్నారు. సమావేశంలో కవి, రచయిత వేదుల శిరీషా పాల్గొన్నారు.

ఓటుంటే..చీర



చీరలు పంపిణీ చేస్తున్న వారి దగ్గర గుమిగూడిన జనం

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రలోభాల చీరల పంపిణీ తంతు కొనసాగుతూనే ఉంది. ఎన్నికల వేళ తాయిలాలను ఇంటికి వెళ్లి మరీ చేతిలో పెడుతున్నారు. సోమవారం నారాయణపురం, సీతంపేట, లలితానగర్ తదితర చోట్ల పంపిణీ జరిగింది. ఐదారుగురు వైసీపీ కార్యకర్తల బ్యాచ్‌కి వలంటీరు, సచివాలయ సిబ్బందిని జతకలిపి వీధుల్లోకి పంపుతున్నారు. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్, ఓటరు లిస్టులో పేరు చెక్ చేసి చీరను అందజేస్తున్నారు. సోమవారం నారాయణపురంలో చీరలు ఇస్తున్న సమయంలో ఒకామె ఓటును ఎగరగొట్టేశారనే విషయం తెలిసింది. దీంతో సచివాలయానికి వెళ్లాలని చీరల పంపిణీ బృందం ఆమెకు ఉచిత సలహా ఇచ్చింది. తన ప్రమేయం లేకుండా ఓటు ఎలా తొలగించారనే ప్రశ్నకు సమాధానం కరువైంది. పైగా చీరల పంపిణీ బృందం వద్ద ట్యాబ్ ఉంటోంది. ఆ ట్యాబ్‌లో కూడా ఓటును, డోర్ నంబరును సరి చూసుకుంటున్నారు. కచ్చితంగా అవి సరిపోలితేనే చీర ఇస్తున్నారు. ఓటు లేని లేదా సాంకేతిక ఇబ్బందులు ఉన్నా, ఓటరు లిస్టులో పేరు లేకపోయినా చీర ఇవ్వడం లేదు. పంపిణీ చేయడానికి జిల్లాకు లక్షల సంఖ్యలో చీరలు వచ్చినట్టు సమాచారం. ఆయా ప్రాంతాల నాయకుల కనుసన్నల్లో తంతు నడుస్తోంది.

తాయిలాల పర్వం



పంపిణీ చేసిన చీర

మహిళలకు చీరలు పంపిణీ చేసిన చిర్ల జగ్గిరెడ్డి

వేర్వేరు చోట్ల మహిళా దినోత్సవం పేరుతో ప్రలోభాలకు తెర



చీరలు పంపిణీ చేస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం, మార్చి 11: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం ఓటర్లకు తాయిలాల పంపిణీకి వైసీపీ తెరలేపింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఏ కార్యక్రమం జరుగుతున్నా దానిని తనకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. సోమవారం రావులపాలెంలో రెండు వేర్వేరు చోట్ల మహిళా దినోత్సవం నిర్వహించి మహిళలకు చీరలు, స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. సీఆర్సీలో రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వైసీపీ తరపున పోటీ చేసి ఓటమి చెందిన వారితో సమావేశం కాగా.. మరో ప్రైవేటు కల్యాణ మండపంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, యానిమేటర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు సిబ్బందితో మహిళా దినోత్సవం వేడుకల్లో సమావేశమయ్యారు. విడివిడిగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఆయన సతీమణి, కుటుంబ సభ్యులతో పాటు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు. జగన్, జగ్గిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సోమసుందరెడ్డి ఫొటోలతో ఉన్న చీర బాక్సు, స్వీటు బాక్సులను మహిళలకు అందజేసి తన గెలుపునకు కృషి చేయాలని కోరినట్టు సమాచారం. అంతే కాకుండా పలు రకాల వంటకాలతో పసందైన విందును కూడా మహిళల కోసం ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకే జగ్గిరెడ్డి ఇలాంటివి చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

మమ్మల్ని వదిలేయండి..వెళ్లిపోతాం

వైసీపీ నేతల సభకు వచ్చిన మహిళలు గగ్గోలు



మహిళలను అడ్డుకుంటున్న యానిమేటర్లు

అంబాజీపేట, మార్చి 11: మమ్మల్ని వదిలేయండి..వెళ్లిపోతాం అంటూ వైసీపీ నేతల సభకు వచ్చిన మహిళలు గగ్గోలు పెట్టారు. అయినా వారిని వదలకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ 4వ విడత చేయూత నిధుల విడుదల కార్యక్రమం మహిళలకు చుక్కలు చూపించింది. ఈ సభకు జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైసీపీ చేసిన కార్యక్రమాలు, పథకాలంటూ ప్రసంగాలను ఏకరవు పెట్టారు. అయితే ఈ సభను మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తారని చెప్పడంతో ముందుగానే మహిళలు సభా వేదిక వద్దకు వచ్చారు. ప్రజాప్రతినిధులు ఆలస్యంగా రావడంతో సభ ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు వెళ్లిపోతున్న సమయంలో డ్వాక్రా యానిమేటర్లు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రసంగాలు జరిగే వరకూ తాము ఉండలేమని యానిమేటర్లతో మహిళలు వాగ్వివాదానికి దిగారు. మహిళలు వెళ్లిపోవడంతో సభను త్వరగా ముగించివేశారు.

హంస వాహనంపై కుక్కుటేశుడు

పాదగయలో ఘనంగా శ్రీపుష్పోత్సవం



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు

పిఠాపురం మార్చి 11: భక్తుల శివనామస్మరణ మధ్య అమ్మవారితో కలిసి కుక్కుటేశుడు హంస వాహనంపై పుష్కరిణిలో విహరించారు. శ్రీపుష్పోత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్లు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు కుక్కుటేశుని తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను హంస వాహనంపై ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం

కుక్కుటేశ్వరస్వామికి ఉదయం స్వామికి అభిషేకం, రాజరాజేశ్వరీ దేవికి కుంకుమార్చనలు జరిగాయి. రాత్రి పది గంటలకు శ్రీ పుష్పోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు కోట వీరవెంకట సత్యనారాయణమూర్తి, కోట దత్తాత్రేయశర్మ, కైతేపల్లి రాజ్‌కుమార్‌శర్మ, కోట విశ్వనాథశర్మ విశేష అలంకరణ చేశారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు దంపత తాంబూలాలు అందజేశారు. అనంతరం ఏకాంతసేవాగానం జరిగింది. ఆస్థాన వేద పండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనాపాఠి, చెరుకుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, ఉత్సవకమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తోపులాట

శ్రీపుష్ప యాగం తర్వాత భక్తులకు దంపత తాంబూలాలు అందించే సమయంలో తోపులాట చోటుచేసుకుంది. తెప్పోత్సవం, పూజా కార్యక్రమాల నిర్వహణ ఆలస్యం కావడంతో రెండు గంటలకు పైగా వేచి ఉన్న భక్తులందరినీ ఒకేసారి వదిలారు. దీంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లోపలకు వెళ్లేందుకు ఒకేసారి భక్తులు ప్రయత్నించడం, క్యూలైన్లు సరిగ్గా లేకపోవడం, దంపత తాంబూలాలకు భారీగా భక్తులు తరలివస్తారని తెలిసినా, తగిన ఏర్పాట్లు చేయడంలో ఆలయ అధికారులు విఫలం కావడం వల్ల ఈ సంఘటన చోటుచేసుకుందని పలువురు ఆరోపిస్తున్నారు.

వైభవంగా శ్రీపుష్ప యాగోత్సవం



ఊయల మందిరంలో స్వామి,అమ్మవారు

సామర్లకోట, మార్చి 11: కుమారరామ భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్లకు శ్రీపుష్పయాగోత్సవ పూజలు సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ ఫెస్టివల్ అధికారిణి అల్లు వెంకట దుర్గాభవాని, కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలలో భాగంగా కల్యాణ వేదికపై స్వామి వారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్, వెంకన్న తదితరుల ఉత్సవ మూర్తులను బాలాత్రిపుర సుందరి అమ్మవారి మందిరం వద్దకు తీసుకుని వచ్చారు. వివిధ రకాల పూలతో అలంకరించిన ఊయల మందిరంలో ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి భక్తుల దర్శనాలకు అనుమతించారు. దాతలు సమకూర్చిన 110 రకాల పిండి వంటకాలను ఊయల మండపం వద్ద ఉంచారు. అనంతరం ప్రముఖులకు దంపత తాంబూలాలు అందజేశారు. సుమారు 2,000 మంది భక్తులు శ్రీపుష్పయాగ పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, తూతిక కామేశ్వరరావు, చంద్రు శ్రీనువాసుసూర్యభాను, కంచర్లపద్మావతి జగన్నాథగుప్త, గంజి బూరిబాబు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

రాయవరం, మార్చి 11: రాయవరం మండలం చెల్లూరు శివారు ఎర్రమట్టిపురంలో రేకుల షెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారంపై విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా 24 బస్తాల్లో నిల్వ ఉంచిన 1035 కిలోల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన కోట సత్యం అనే వ్యక్తి చెల్లూరు, పాశర్లపూడి గ్రామాల్లో కార్డుదారుల నుంచి కిలో బియ్యం 14 రూపాయలకు కొనుగోలు చేసి మొక్కజొన్న విత్తనాలు కలిపి కోళ్లఫారాలకు 16 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.53 వేల 92 రూపాయలు ఉంటుందని అంచనా వేసి కోట సత్యంతో పాటు సంబంధికులపై 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమండ్రి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బియ్యం అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతోందని, ఎవరైనా రేషన్ బియ్యం కొనుగోలు, అమ్మకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథం, రాయవరం సీఎస్‌డీటీ అవిఫా, జీవానందం, లోవరాజు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నాలుగేళ్ల శిక్ష

అమలాపురం టౌన్, మార్చి 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ఏరుపల్లి గ్రామంలో 2010 డిసెంబరు 30న జరిగిన దోపిడీ కేసులో ముద్దాయి తిల్పిడియా రంజిత్‌సింగ్ అలియాస్ బడాసింగ్‌కు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ రామచంద్రపురం సెషన్స్ కోర్టు జడ్జి కె.వెంకటేశ్వరరావు తీర్పు ఇచ్చినట్టు ఎస్పీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ద్రాక్షారామ ఎస్ఐ జి.సురేంద్ర తెలిపిన వివరాల ప్రకారం... ఏరుపల్లిలో చల్లా వెంకటేశ్వరరావు ఇంట్లో అర్ధరాత్రి సమయంలో నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన రంజిత్ సింగ్‌తో పాటు మరో ఏడుగురు చొరబడ్డారు. వెంకటేశ్వరరావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కత్తులతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచి బంగారు ఆభరణాలు అపహరించుకుని పారిపోయారు. అప్పట్లో వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పోలీసు స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ ఎండీ ఉమర్ కేసు నమోదు చేయగా సీఐ ఎం.రాజారావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. రంజిత్‌సింగ్‌తో పాటు మిగిలిన వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు.స్పీడీ ట్రయల్ కేసుగా గుర్తించి ఎస్ఐ సురేంద్రతో పాటు కోర్టు కానిస్టేబుల్ వాసిరెడ్డి జానకిరామయ్య కోర్టులో సాక్ష్యులను హాజరుపరచగా ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంవీవీఎస్ఎస్ ప్రకాష్ వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం రంజిత్‌సింగ్‌పై నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

ఒకరి మృతి..ముగ్గురికి గాయాలు



అనపర్తి, మార్చి 11: అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం వంతెన వద్ద సోమవారం రెండు బైకులు ఢీకొని నలుగురు వ్యక్తులు తీవ్రగాయాలపాలయ్యారు. వారిలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మండపేటకు చెందిన ఇళ్ల సూర్యసాయిరామ్, ఇప్పనపాడుకు చెందిన గొరసా సాయిచంద్ ఒక బైక్‌పై వస్తుండగా మరో బైక్‌పై మండపేటకు చెందిన కొమ్మిశెట్టి వెంకటేష్(29), సత్తిబాబు సోదరులు పెద్దాపురం పనికి వెళ్లి పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో వస్తున్నారు. వారి రెండు బైక్‌లు లక్ష్మీనరసాపురం కెనాల్ రోడ్డులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన అందరినీ రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా వెంకటేష్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

గంజాయి స్వాధీనం

నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

రాజానగరం, మార్చి 11: ఒడిసా నుంచి కేరళ రాష్ట్రానికి గంజాయిని తరలిస్తున్న నలుగురు రాజానగరం పోలీసులకు పట్టుబడ్డారు. కేరళకు చెందిన నలుగురు వ్యక్తులు లగేజీ బ్యాగుల్లో 39.35 కిలోల గంజాయిని లారీలో తరలిస్తుండగా మార్గమధ్యంలో తూర్పుగోనగూడెం పోలీసు చెక్‌పోస్టు వద్ద పోలీసులకు చిక్కారు. లారీలో ప్రయాణికులు మాదిరిగా బ్యాగుల్లో గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని సీఐ పి.కాశీవిశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

పంట బోదెలో మృతదేహం

కాజులూరు, మార్చ్ 11: కాజులూరు మండలం కోలంక శివారు చలివేంద్రపాడు వెళ్లే రోడ్డులో పందుల పాక సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. ఈ మేరకు స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్, ఇతర పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం మొత్తం ఉబ్బిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. ముఖానికీ, శరీరానికి పురుగులు పట్టి దుర్వాసనతో కూడుకుని ఉంది. శరీరంపై తెలుపు, పచ్చ రంగు చారలు కలిగిన పొడవు చేతుల చొక్కా, సిమెంటు రంగు నిక్కరు, మెడలో తెలుపు రంగు తువ్వాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు సుమారు 5 రోజుల క్రితం మరణించి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసిన గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్సీహెచ్‌ఈ వైస్ ఛైర్మన్ కె.రామ్మోహన్‌రావు

ఏబీసీ ద్వారా డిగ్రీ, డిప్లమో, పీజీ డిప్లమో కోర్సులు

జేఎన్టీయూకే, మార్చి 11: అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ) ద్వారా డిగ్రీ, డిప్లమో, పీజీ డిప్లమో కోర్సులు విద్యార్థులు పూర్తిచేసేందుకు వీలు కలుగుతుందని ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ కె.రామ్మోహన్‌రావు అన్నారు. జేఎన్టీయూకేలోని వీసీ సమావేశ హాల్లో ఓడీఎల్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఎన్‌ఏడీ డిజిలాకర్, డిజిటల్ ఇండియా కార్పొరేషన్, ఎంఈఐటీ సహకారంతో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ప్రతినిధులకు ఏబీసీ విధానాలు, ప్రక్రియలు, సమ్మతి అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. దీనిలో రామ్మోహన్‌రావు ముఖ్య అతిథిగానూ, వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు,రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత గౌరవ అతిథులుగానూ పాల్గొనగా ఓడీఎల్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం ఏబీసీ దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో ఒక కోర్సులో తగిన క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ మెకానిజంతో చదువుకునేందుకు, విద్యార్థులు సులభతరంగా విద్యనభ్యసించేందుకు ఉద్దేశించిందన్నారు. అనంతరం వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఏబీసీ ద్వారా విద్యార్థి క్రెడిట్‌ల ప్రామాణికతను గోప్యంగా ఉంచడంతో పాటూ డిజిటల్ మోడ్ ద్వారా సులభంగా క్రెడిట్‌లను బదిలీ చేసుకోవచ్చన్నారు. 2020-21 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఈనెల 31లోగా గ్రేడ్ షీట్‌లను ప్రచురిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రవిపాండే, ఎస్.చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీకి మాజీ ఎంపీ గీతకు అడ్డంకులు తొలగినట్టే

రంపచోడవరం, మార్చి11: వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు అడ్డంకిగా ఉన్న సీబీఐ కేసులో శిక్షను తెలంగాణా హైకోర్టు రద్దు చేసింది. బ్యాంకును మోసగించిన కేసులో కొత్తపల్లి గీతకు సీబీఐ కోర్టు శిక్ష, జరిమానా విధించిన విషయం తెలిసిందే. దీనిపై ఆమె తెలంగాణ హైకోర్టులో అప్పీలుకు వెళ్లారు. ఆ కేసు విచారణలో ఉంది. అయితే ప్రస్తుతం ఆమె బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమవడంతో దిగువ కోర్టు విధించిన శిక్షను రద్దు చేసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత కల్పించాలని కొత్తపల్లి గీత తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆమె చేసుకున్న వినతిని హైకోర్టు ఆమోదించింది. ఆమెపై ఉన్న శిక్షను రద్దు చేస్తూ ఇటీవల తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను జారీ చేసింది.

జీజీయూలో మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ప్రారంభం



ఓ విభాగాన్ని పరిశీలిస్తున్న చైతన్యరాజు

రాజానగరం, మార్చి 11: గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆస్పత్రిని చైతన్య సంస్థల ఛైర్మన్, జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పరికరాలతో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు కలిగి ఉండడం మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ప్రత్యేకత అన్నారు. తమ సంస్థ ప్రతి ఉద్యోగి, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. జీజీయూ ఉద్యోగులు, విద్యార్థులతో పాటు ఇతరులు కూడా ఆసుపత్రి సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమలాపురంలోని కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్ వర్మ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించి తొలి మెడిసిన్ సదుపాయం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అనంతరం మెడ్ యునైటెడ్ ఆసుపత్రిని చైతన్యరాజు ప్రారంభించగా, జనరల్ వార్డును శశికిరణ్ వర్మ, ఫార్మసీని రవికిరణ్ వర్మ, కన్సల్టేషన్ గదులను డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ, ప్రత్యేక గదులను డైరెక్టర్ టీవీ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో గైట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.లక్ష్మీ శశివర్మ, పీజీ రామానుజం, బాబు, కె.వల్లీమావి, రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం తహసీల్దార్‌గా రాజరాజేశ్వరి

కపిలేశ్వరపురం,మార్చి11: కపిలేశ్వరపురం తహసీల్దార్‌గా రాజరాజేశ్వరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె పెరవలి నుంచి ఇక్కడ వచ్చారు. రాజరాజేశ్వరికి ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన కె.సాయికృష్ణ రామచంద్రపురం ఆర్డీవో ఆఫీస్‌కు బదిలీపై వెళ్లారు. డీటీ వెంకటేశ్వరరావు, కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్‌ఏల సంఘం అధ్యక్షకార్యదర్శులు పలివెల నాగేశ్వరరావు, కొల్లు శ్రీనివాస్, ఎ.శివప్రసాద్, జానకిబాబు పాల్గొన్నారు.

- కొత్తపేట ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు
- మారిశెట్టివారిపాలెంలో బాబు ష్యూరిటీ..
- సూపర్-6 పథకాల కరపత్రాల పంపిణీ

బీసీలను అన్ని విధాలా ఆదుకుంటాం





ఆత్రేయపురం: భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో అసెంబ్లీ అభ్యర్థి బండారు, ఐ.పోలవరం: బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు, ఆలమూరు:బండారు సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

ఆత్రేయపురం, మార్చి 11: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలను చంద్రబాబు అన్ని విధాలా ఆదుకుంటారని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. వెలిచేరు శివారు ఊదలమ్మగౌడపాలెం, వద్దిపర్రు శివారు మారిశెట్టివారిపాలెంల్లో సోమవారం రాత్రి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బండారు ఇంటింటికీ తిరిగి సూపర్-6 పథకాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. గౌడ సంఘం నాయకుడు ఐనం వెంకట్రావు, చంద్రరావు ఆధ్వర్యంలో 50మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ముళ్ళపూడి భాస్కరరావు, జుజ్జవరపు శ్యామలహరిబాబు, కవల సత్తిబాబు, ఐనం నాగరాజు, మిద్దే శ్రీరామమూర్తి, మెర్ల రాము, బొగడ బుజ్జి, అధిక సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆలమూరు, మార్చి 11: మూలస్థానం అగ్రహారంలో వైసీపీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. వారితో పాటు వంద మంది కార్యకర్తలుచేరారు. వారందరికీ టీడీపీ కండువాలువేసి స్వాగతించారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

మండపేట, మార్చి11: స్థానిక టీడీపీ కార్యాలయంలో రాయవరం మండలం పసలపూడికి చెందిన మాజీ సర్పంచ్ బొడబళ్ల అప్పలస్వామి (పెద్ద), వైసీపీ యూత్ నాయకుడు చింతా సతీష్‌రెడ్డి సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి వేగుళ్ల కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మల్లిడి సూర్రెడ్డి, అనుసూరి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటకృష్ణారెడ్డి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, సల్లమిల్లి వెంకన్నబాబు, కె.సుధాకర్‌రెడ్డి, కె.వేణుగోపాల్‌రెడ్డి, జి.సత్తిబాబు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ఐ.పోలవరం, మార్చి 11: పశువుల్లంకకు చెందిన 30 మంది వైసీపీ కార్యకర్తలు పార్టీని వీడి సోమవారం టీడీపీ, జనసే, బీజేపీ ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఎన్.సతీష్, ఎన్.పెద్ద, సీహెచ్ నాగబాబు, నాగళ్ళ వెంకన్న, సీహెచ్ శ్రీను తదితరులున్నారు.

పుల్లేటికుర్రులో ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్న సర్పంచ్



పుల్లేటికుర్రులో రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న సర్పంచ్ బాలరాజు, వార్డు సభ్యులు

అంబాజీపేట, మార్చి11: ఎన్నికల సమీపిస్తున్ననేపథ్యంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు హడావిడిగా ప్రారంభిస్తున్నారు. గంగలకుర్రు, మొసలపల్లి, మాచవరం, పుల్లేటికుర్రులో నిర్మించిన సచివాలయ, ఆర్బీకే భవనాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు వచ్చారు. పుల్లేటికుర్రు మార్కెట్‌లో రూ.61.80 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే కేంద్రాల్లో ఏవిధమైన సౌకర్యాలు కల్పించలేదని, ఈభవనాల్లో ప్రారంభించేందుకు వీలులేదని సర్పంచ్ జల్లి బాలరాజు, వార్డు సభ్యులు అడ్డుకున్నారు. సౌకర్యాలు పూర్తిగా కల్పించాలని, పనులు కూడా పూర్తిస్థాయిలో చేపట్టిన తరువాతే వీటిని ప్రారంభించాలని వారు ఎమ్మెల్యేకు వివరించారు. అయినప్పటికి వారిని లెక్కచేయకుండా పోలీస్‌బందోబస్తుతో సచివాలయాన్ని, ఆర్బీకే కేంద్రాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రారంభించి వెళ్లి పోయారు. దీంతో సర్పంచ్ బాలరాజు, వార్డు సభ్యులు అక్కడ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, డీఎల్‌పీవో బొజ్జి రాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో బి.మమత, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, సొసైటీ అధ్య క్షుడు దొమ్మేటి సత్యమోహన్, నందుల ఆదినారాయణ, బొంతు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఊరూ వాడ గాజు గ్లాసు-ఇదే మన భవిష్యత్తు



ఊరూ వాడ గాజుగ్లాసు-ఇదే మన భవిష్యత్తు కార్యక్రమంలో జనసేన నాయకుడు బొంతు రాజేశ్వరరావు, ఎంపీపీ కేతా శ్రీను

రాజోలు, మార్చి 11: జనసేన పార్టీ ఎన్నికల గుర్తు గాజు గ్లాసును ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి జనసేన పార్టీ నాయకుడు బొంతు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో తాటిపాక సెంటర్‌లో ఊరూ వాడ గాజు గ్లాసు-ఇదే మన భవిష్యత్తు కార్యక్రమంలో సోమవారం ఉచితంగా గాజు గ్లాసులో టీ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బొంతు రాజేశ్వరరావు, ఎంపీపీ కేతా శ్రీనులు మాట్లాడుతూ టీడీపీ జాతీయాధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర ప్రజలకు అండగా ఉంటారన్నారు. వీరు ప్రకటించిన సూపర్-6 పథకాలను టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి గుండాబత్తుల తాతాజీ, రాజోలు, మలికిపురం, మామిడికుదురు మండల అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాస్, మల్లిపూడి సత్తిబాబు, జాలెం శ్రీనివాస్, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, ఎంపీటీసీ దార్ల లక్ష్మీకుమారి, టీడీపీ, జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మెరక చేయలేకపోయాం
మళ్లీ గెలిపిస్తే వేసవిలో మెరక చేస్తాం
పట్టాలు ఇచ్చారు సరే.. రిజిస్ట్రేషన్లు ఏవీ

అమలాపురం రూరల్, మార్చి 11: మండలంలో లోతు ఎక్కువగా ఉన్న ఇళ్ల స్థలాలను కొనుగోలు చేశాం. మట్టి సమస్యతో పాటు ఆసరా, అమ్మఒడి వంటి సంక్షేమ పథకాల వల్ల ఆర్థిక ఇబ్బందులతో ఇళ్లస్థల భూములను మెరక చేయలేకపోయామని మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే వేసవిలోనే మెరక పనులు పూర్తిచేసి రూ.1.80లక్షలు చొప్పున ఇంటి నిర్మాణ రుణాలు అందించి ఇళ్ల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో సోమవారం మండల పరిధిలోని గ్రామాలకు చెందిన ఇళ్ల స్థల పట్టాలు పొంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారికే మండలశాఖ అధ్యక్షుడు బొంతు గోవిందుశెట్టి అధ్యక్షతన పట్టాల పంపిణీ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ 2182మంది లబ్ధిదారుల పట్టాలు రిజిస్ట్రేషన్లు కాగా భట్నవిల్లి, నడిపూడి, కామనగరువు, ఈదరపల్లి గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు 500వరకు మిగిలిపోయాయని వివరించారు. అయితే సభ జరుగుతుండగా జనుపల్లి గ్రామానికి చెందిన పలువురు మహిళలు తమకు మూడున్నరేళ్ల క్రితం గ్రామంలోనే ఇళ్లస్థల పట్టాలిచ్చారు, ఇప్పుడుకనీసం రిజిస్ట్రేషన్లు చేయలేదు. అసలు తమ పట్టాలకు విలువ ఉందా లేదా అని ప్రశ్నించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వేరేగ్రామంలో ఇళ్లస్థల పట్టాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని, క్యాంపు కార్యాలయానికి వచ్చి సమస్యను వివరించాలని మంత్రి వారికి సూచించారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఎంపీటీసీ అంకం హిమభారతి పాల్గొన్నారు.

'రాష్ట్రాభివృద్ధి అంటే బటన్ నొక్కడం కాదు'



ఎమ్మెల్యే వేగుళ్లను పూలమాలలు వేస్తూ ఆశీర్వదిస్తున్న ముస్లింలు

కపిలేశ్వరపురం, మార్చి 11: రాష్ట్రాభివృద్ధి అంటే తాడేపల్లి ప్యాలస్‌లో కూర్చుని బటన్ నొక్కడం కాదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు విమర్శించారు. సోమవారం అంగరలో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో యువతకు ఎన్నోవేల ఉద్యోగాలను కల్పించగా నేడు సీఎం జగన్ ప్రతీఏటా జాబ్‌క్యాలెండర్ అంటూ చెప్పి యువతను మభ్యపెట్టారన్నారు. నేడు రాష్ట్రం నుంచి ఉద్యోగాల కోసం యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్న దుస్థితికి తీసుకువచ్చారన్నారు. గ్రామంలో పర్యటించిన ఆయనకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు.కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలని సీపీఎం ధర్నా



సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్, మార్చి 11: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, తక్షణం వాటిని ఉపసంహరించుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బాండ్ల వివరాలను వెల్లడించాలని డిమాండు చేస్తూ అమలాపురం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్లు, బూర్జువా పార్టీలను కాపాడేందుకు ఎస్‌బీఐ ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించకుండా దాట వేస్తోందని ఆరోపించారు.48కోట్లమంది ఖాతాదారులు ఉన్న ఎస్‌బీఐ అత్యాధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నందున 5నిమిషాల వ్యవధిలోనే ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించగలదన్నారు. ఎన్నికల బాండ్ల ముసుగులో బూర్జువా పార్టీలు క్విడ్ ప్రోకోకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. సీపీఎం జిల్లాకమిటీ సభ్యులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, విప్పర్తిమోహనరావు, భాస్కరరావు, వెంకటరమణ, సుధాకర్ పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, మార్చి 11: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి బెంగళూరుకు చెందిన అద్దంకి సతీష్-దుర్గాశ్యామల దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. వారికి ఈవో స్వామివారి చిత్రపటం అందజేశారు.

రాయుడుగారి అబ్బాయి చిత్ర బృందం పర్యటన

మలికిపురం, మార్చి 11: రాజుగారి అమ్మాయి.. రాయుడుగారి అబ్బాయి చిత్ర బృందం మలికిపురం పద్మజ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమాను చూశారు. ఈ నెల9న సినిమా రిలీజ్ అయి విజయవంతం కావడంతో చిత్ర బృందం, సినిమా డైరెక్టర్ కుంపట్ల సత్యరాజ్, హీరోనున్న రవితేజ, హస్యనటుడు మోరం నాయుడు, బోనం బాబి, అడబాల దుర్గాజీ, యేడిద అశోక్‌లు సోమవారం పద్మజ థియేటర్‌లో సినిమాను చూశారు. డైరెక్టర్ సత్యరాజ్ మాట్లాడుతూ ఈసినిమాలో కోనసీమ జిల్లాకు చెందిన వారే ఎక్కువగా నటించారన్నారు. కోనసీమ, రాజోలు ప్రాంతాల్లో 85శాతం ఈచిత్రాన్ని నిర్మించామన్నారు.

ఆర్వో ప్లాంటు ప్రారంభం

రాజోలు, మార్చి 11: చింతలపల్లిలో పిప్పళ్లవారి మెరకలో ఉన్న ఎంపీపీ స్కూలులో మండల ప్రజాపరిషత్‌లో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.4.50లక్షలతో ఏర్పాటుచేసిన పిల్లలకు రక్షణగా ప్రహరీని, ఆర్వో ప్లాంటును ఎంపీపీ కేతా శ్రీను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, ఎంఈవో ఎస్.మనోహరం, స్కూలు చైర్మన్ కలిగిత అరుణకుమారి, వైస్ ప్రెసిడెంట్ బొక్కా రామకృష్ణ, తులా సత్యనారాయణ, పిప్పళ్ల రాంబాబు, ఉపాధ్యాయులు ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

రెడ్డి సుబ్రహ్మణ్యం కృతజ్ఞతా పర్యటన

ద్రాక్షారామ, మార్చి 11: రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం సోమవారం రామచంద్రపురం పట్టణంలో కృతజ్ఞతా పర్యటన చేశారు. పట్టణంలో అక్కల రాగూర్, జాస్తి విజయలక్ష్మీ, వంజరపు రాజేశ్వరి, దొమ్మలపాటి విజయలక్ష్మీ, బళ్ల లక్ష్మీ తదితరులు నివాసాలకు వెళ్లి తనను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించినప్పటి నుంచి తనకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబును సీఎం చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

ఎస్పీ స్పందనకు 29 అర్జీలు

అమలాపురం టౌన్, మార్చి 11: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో ఎస్పీ ఎస్.శ్రీధర్ 29అర్జీలను స్వీకరించారు. వ్యక్తిగత సమస్యలతో పాటు భూవివాదాలు, ఆస్తి తగాదాలపై ఫిర్యాదులు అందుకున్నారు.

జైభీమ్ జెండా ఆవిష్కరణ

రాజోలు, మార్చి11: దళిత చైతన్యవేదిక ఆధ్వర్యంలో తాటిపాక సెంటర్‌లో జైభీమ్ జెండాను సోమవారం ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ చింతా లక్ష్మి జైభీమ్ జెండా ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ చిలకపాటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ మాట్లాడారు.

హడావిడిగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

ఉప్పలగుప్తం, మార్చి 11: మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం కిత్తన చెరువు, చల్లపల్లి, గోపవరం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సర్పంచ్ కుంచే జ్యోతి ఆధ్వర్యంలో కిత్తనచెరువులో రైతు భరోసా కేంద్రాన్ని, సర్పంచ్‌లు కుంచు బుల్లియ్య, గెద్దం స్వరూపాసురేష్‌బాబు ఆధ్వ ర్యంలో గోపవరంలో ఆర్బీకే, సచివాలయ భవనాలను ప్రారంభించారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు ఆధ్వర్యంలో చల్లపల్లిలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సీసీ రహదారిని ప్రారంభించారు. తాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలను ప్రజలు మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, జడ్పీటీసీ గెద్దం సంపదరావు, వైసీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ, ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, ఎంపీటీసీలు, సొసైటీల చైర్మన్లు పాల్గొన్నారు.

సిద్ధం సభ కాదు మాయా సభ
టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్

అమలాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలో సీఎం జగన్ నిర్వహించిన వైసీపీ సిద్ధం సభ గ్రాఫిక్స్‌తో కూడిన మాయా సభ అని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ ఆరోపించారు. అమలాపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15లక్షల మందితో సభ నిర్వహించామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ సభలో ఉన్నది లేనట్టుగాను, లేనిది ఉన్నట్టుగాను చూపడం ద్వారా ప్రజలను మభ్యపెట్టారని... చివరకు ప్రత్యక్ష ప్రసారాన్ని సైతం 40నిమిషాల పాటు ఆలస్యంగా విడుదలచేసిన తీరు ఇందుకు అద్దంపడుతోందని ఆరోపించారు. ఉమ్మారెడ్డి తయారుచేసిన మేనిఫెస్టోను జగన్ విసిరికొట్టారని, సభలో ఆ మేనిఫెస్టోను ఎందుకు విడుదల చేయలేకపోయారని ప్రశ్నించారు. టీడీపీ ఇచ్చిన వాగ్దానాల అమలుకు సంబంధించి ఆర్థిక పరిపుష్టిని ఏవిధంగా మదింపు చేస్తారో బాగా తెలుసని, ఏ ఒక్క సంక్షేమాన్నీ రద్దు చేయకుండా చంద్రబాబు ప్రజారంజక పాలన నిర్వహిస్తారని శ్రీనివాస్ పేర్కొన్నారు. సిద్ధం సభలో మృత్యువాత పడిన ఘటనకు సంబంధించిన బాధ్యులైన నిర్వాహకులైన అరెస్టు చేయాలని శ్రీనివాస్ డిమాండు చేశారు.

గ్రామాల్లో అదనపు బలగాల కవాతు

అమలాపురం రూరల్, మార్చి 11: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా సమస్యాత్మక గ్రామాలు, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ప్రధానంగా దృష్టి సారించినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. సోమవారం జిల్లాలోని పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న ఈదరపల్లి, నారాయణపేట, కొత్తపేట పీఎస్ పరిధిలోని మోడేకుర్రు, రాకుర్తివారిపాలెం, కుంచేవారిపేట, మలికిపురం పీఎస్ పరిధిలోని పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం, రాయవరం పీఎస్ పరిధిలోని చెల్లూరు, వెంటూరు గ్రామాల్లో పోలీసులు, కేంద్ర బలగాలు సంయుక్తంగా కవాతు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పట్టణ సీఐ క్రిస్టఫర్ పిలుపునిచ్చారు.

రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

అంతర్వేది, మార్చి 11: అంతర్వేదిలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ పోతరాజు కృష్ణ ఇంటి వద్ద బాబు సూపర్-6 టేబుల్ క్యాలెండర్‌ను జనసేన, టీడీపీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. స్థానిక సర్పంచ్ పోతరాజు నరసింహారావు(కిశోర్) అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా టీడీపీ, జనసేన సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు విచ్చేసి మాట్లాడారు. రాబోయే ఎన్నికలపై ప్రణాళికాబద్ధంగా వెళ్లాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో గెద్దం మహాలక్ష్మిప్రసాద్, ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, చొప్పల బాబూరావు, దీపాటి నితిన్, కొల్లు మహాలక్ష్మి, చెల్లుబోయిన వెంకటరమణ, షరాకుల రాజారత్నం, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

1,194 సంఘాలకు రూ.114.29కోట్ల బ్యాంకు రుణాలు

అమలాపురం టౌన్, మార్చి 11: మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు మహిళా సాధికారతకై డ్వాక్రా మహిళా సంఘాలు చేస్తున్న కృషిని ప్రధాని మోదీ అభినందించినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని 1194 స్వయం సహాయక సంఘాలకు రూ.114.29కోట్లు బ్యాంకు రుణాలు అందించగా చెక్కును కలెక్టర్ మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో జేసీ ఎస్.నుపూర్‌అజయ్ డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డీఎస్ అన్నపూర్ణ, రమణ, శామ్యూల్, ఎంఎం జిలానీ తదితరులు పాల్గొన్నారు. ఈనెల13న కేంద్ర సామాజిక న్యాయం సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సాధికారత పథకాల కింద లక్షిత సమూహాల లబ్ధిదారులతో ఢిల్లీ నుంచి వర్చువల్ మోడ్‌లో జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

వెంకన్న ఆలయంలో శిఖర కళాప్రకర్షణ

ఆత్రేయపురం, మార్చి11: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన స్వర్ణ శిఖరాన్ని ఈనెల16వతేదీ ఉదయం 10.26గంటలకు ప్రతిష్ఠించనున్నారు. సోమవారం శిఖర కళా ప్రకర్షణ నిర్వహించారు. వైఖానస ఆగమ పండితుడు ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో సప్త కలశారాధన, మహాస్నపనం, మహాశాంతి హోమం, పూర్ణాహుతి జరిపారు. చైర్మన్ రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి 9నెలల జైలు

అయినవిల్లి, మార్చి 11: దొంగతనం కేసులో నిందితులకు 9నెలలు జైలు శిక్ష పడినట్టు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. 2022లో పల్లబోతు సత్యనారాయణ కుమార్తెకు చెందిన హార్డ్‌వేర్ జనరల్ స్టోర్ షట్టర్స్ పడమట గోపాల కృష్ణ, నక్కా వినయ్‌లు బద్దలుకొట్టి రూ.10వేలు చోరీ చేశారు. ఆమె ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. అమలాపురం ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి కోర్టులో కేసు విచారించగా ఏపీపీ హెచ్.రాజ శేఖర్ వాదనలు వినిపించారు. న్యాయమూర్తి వి.గౌరీశంకర్ నిందితులకు 9నెలలు చొప్పున జైలు శిక్ష విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

పరిహారం విడుదలపై మల్లాడి కృతజ్ఞతలు

యానాం, మార్చి 11: మత్స్యకారులకు ఓఎన్జీసీ పరిహారం విడుదలకు సహకరించిన గవర్నర్, సీఎం, మంత్రులు, ఇతర అధికారులకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై, సీఎం ఎన్.రంగసామి, ఉన్నతాధికారులను పుదుచ్చేరిలో కలిసి శాలువాలతో సత్కరించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: బాయ్స్
వెంకటరమణ	: ఆపరేషన్ వాలంటైన్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్క్రీన్-1	: ఊరిపేరు భైరవకోన
శేఖర్ స్క్రీన్-2	: బుల్లెట్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: భీమ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: రికార్డు బ్రేక్

మహిళా సాధికారతకు సహకరించండి

మలికిపురం, మార్చి 11: మహిళలపై పెట్టుబడి పెట్టండి, మహిళా పురోగతికి సహకరించండి అని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంఈవో ఎం.విజయశ్రీని సత్కరించారు. స్త్రీ సమానత్వమే ప్రగతికి మూలమన్నారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఎంపీడీవో వీరాస్వామినాయుడు, సూపర్‌వైజర్లు ప్రసన్నరాణి, సరోజిని, బాల పాల్గొన్నారు.

టీడీపీ ఉప్పూడి గ్రామకమిటీ ఎన్నిక



పెద్ద

కాట్రేనికోన, మార్చి11: ఉప్పూడి టీడీపీగ్రామకమిటీని సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు సమక్షంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షునిగా పోలిశెట్టి వీరవెంకటసత్యనారాయణ(పెద్ద), ఉపాధ్యక్షుడిగా ఉందుర్తి పరంజ్యోతి, ప్రధాన కార్యదర్శిగా తాళ్ళ రామకష్ణ, కార్యదర్శులుగా మాగాపు సత్యనారాయణ(పండు), పరమట సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా వెలిగట్ల బుజ్జి, బొబ్బిలి రాంబాబు, మాకే మురళి, కొంకి వెంకటేష్ ఎన్నికయ్యారు. సర్పంచ్ రంబాల రమేష్, నెల్లి పల్లారావు, రంబాల దొరబాబు, చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్, జొన్నాడ రాజారావు, గిడ్డి చంటి పాల్గొన్నారు.

మహిళలకు సంక్షేమ పథకాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 11: మహిళాభ్యున్నతికి వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసిందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. సోమవారం పట్టణంలో కృత్తివెంటిపేర్రాజు పంతులు జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం వైఎస్‌ఆర్ చేయూత లబ్ధిదారులకు రూ.7.31కోట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్‌చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరరావు, కొలమూరి శివాజీ, ఏఎంసీ చైర్మన్ పండుల గోవిందరాజు, ఎంపీపీ అంబటి భవానీ, మున్సిపల్ కమీషనరు, ఎంపీడీవో, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

యానాం వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

యానాం, మార్చి 11: యానాం శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి (యానాం వెంకన్న) కల్యాణమహోత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఉదయం 8.03గంటలకు సంకల్పం, విశ్వేక్సేన పూజ, పుణ్యావచనం, స్వామివారి పందిరాట మహోత్సం నిర్వహించారు. దీంతో స్వామివార్ని పెండి కుమారుడిగా అలంకరించారు. అనంతరం విశేషపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఖండవల్లి రామకృష్ణ, ఎస్పీ, ఉత్సవాదారులు పాల్గొన్నారు. సాయంత్ర ఆలయఅర్చకులు, ఉత్సవాదారులుగా ఉన్న బెజవాడ బాపన్న నాయుడు మనుమలు స్వామివారిని సర్పవానంపై గ్రామోత్సవం నిర్వహించారు.

కామెర్ల వ్యాధితో ఉపాధ్యాయుడి మృతి

ఆత్రేయపురం, మార్చి11: లొల్ల జడ్పీ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వంగపండు శ్యామ్‌కుమార్(45) కామెర్ల వ్యాధితో బాధపడుతూ సోమవారం మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్యామ్ మృతికి యూటీఎఫ్ సభ్యులు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

రాజోలు, మార్చి 11: ఆర్టీసీ బస్సు ఢీకొని తాటిపాక మఠానికి చెందిన మామిడిశెట్టి వెంకట్రావు(70) మృతిచెందినట్టు ఎస్‌ఐ జి.పృథ్వి తెలిపారు. వెంకట్రావు తాటిపాక మఠం నుంచి సైకిల్‌పై పొలానికి వెళుతుండగా భీమవరం నుంచి అమలాపురం వెళుతున్న ఎక్స్‌ప్రెస్ పొదలాడలో శుభం గ్రాండ్‌ఎదురుగా ఢీకొనడంతో వెంకట్రావు అక్కడికక్కడే మృతిచెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పాఠశాల భవన నిర్మాణానికి ఎంపీ అనురాధ శంకుస్థాపన

అల్లవరం, మార్చి 11: మండలంలోని గోడిపాలెంలో రూ.14.83 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో పాఠశాల భవన నిర్మాణానికి ఎంపీ చింతా అనురాధ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, ఎస్.ఏడుకొండలు, సర్పంచ్‌లు తోట శ్రీదేవి, తిక్కిరెడ్డి శ్రీనివాస్, రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, రాయుడు విష్ణుత్రిమూర్తులు, ఎంపీటీసీలు కాండ్రేగుల వాణిఅచ్యుతం, పి.రాజేశ్వరి, తోట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పి.గన్నవరం, మార్చి11: పి.గన్నవరం సీహెచ్‌సీలో డాక్టర్ ఎన్.సంధ్యారాణి, నాగుల్లంక పీహెచ్‌సీలో వైద్యాధికారులు డాక్టర్ షేక్ జాసిమ్, డాక్టర్ మహ్మద్ రియాజ్‌తున్నిషా బేగం ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పి.గన్నవరంలో వేణు ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగాఈశ్వరరావు ఆధ్వర్యంలో, నాగుల్లంకలో బోళ్ల వీరాస్వామి సత్రం, బోళ్ల మురళీమోహనరావు ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది ఎ.నాగరాజు, బివివియస్ఎన్ మూర్తి, కె.దుర్గాబాయి, స్థానికులు నల్లా పెద్దకాపు. నల్లా రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పోషకాహారం తీసుకోవాలి

పి.గన్నవరం, మార్చి 11: ప్రతి మహిళ పోషక ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ షేక్ జాషీమ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీవో కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం లింగనిర్ధారణ, గృహహింస చట్టం తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. సీడీపీవో డి.వెంకటేశ్వరి, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, ఏపీఎం మురళీకృష్ణ, అసిస్టెంట్ సీడీపీవో వై.విజయశ్రీ, సూపర్‌వైజర్లు పీఎస్ పద్మావతి, ఎస్.పుణ్యవతి, పి.జ్యోతి పాల్గొన్నారు.

వైసీపీతో మత్స్యకారులకు పథకాలు

ముమ్మిడివరం, మార్చి 11: మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరంలో సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఓఎన్జీసీ సంస్థ కార్యకలాపాలతో నష్టపోయిన మత్స్యకారులకు ఆ సంస్థ ఐదో విడతగా అందిస్తున్న రూ.161కోట్లను సీఎం జగన్ వర్చువల్ విధానంలో బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తారన్నారు. అమలాపురం పార్లమెంటు సమన్వయకర్త రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి చేకూరిన లబ్ధిని వివరించారు. దున్నా జనార్ధనరావు, పెన్మెత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, ఢిల్లీ నారాయణ, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, హితకారిణి సమాజ్ చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, ఎంపీపీలు కోలా గంగాభవానీ, పాలెపు లక్ష్మి, మిరియం జ్యోతి,జడ్పీటీసీలు కుడుపూడి శంకరరావు, నేల కిశోర్‌కుమార్, ముదునూరి సతీష్‌రాజు, దొమ్మేటి శామ్యూల్‌సాగర్ పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో సోమవారం జరిగిన మత్స్యకార భరోసాకు సభకు విద్యుత్ లైన్ నుంచి నేరుగా తీగలు లాగి విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డారు. విద్యుత్‌శాఖ అధికారులు అక్కడే ఉన్నా పట్టించుకోలేదు. ఈసభలో ఎమ్మెల్యే ప్రసంగం పూర్తికాకుండానే కొంతమంది లబ్ధిదారులు సభాస్థలి నుంచి వెళ్లిపోవడం కనిపించింది. సభకు కార్లు, ప్రైవేటు బస్సులు, ఆటోల్లో జనాన్ని తరలించారు. సభ ప్రారంభంలో పొరపాటున తెలుగుదేశం పాట వినిపించడంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే గమనించిన దాన్ని సరిదిద్దారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

ముమ్మిడివరం, మార్చి 11: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఇందిరమ్మ అభయహస్తం పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అమలాపురం పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో సోమవారం సురేష్‌బాబు అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది. అనంతరం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బ్రోచర్లను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో దివి వెంకన్నబాబు, వడ్డి నాగేశ్వరరావు, అయితాబత్తుల పండుబాబు, గోడి భాస్కరరావు, కుంచుస్తంభం సోని, పాలెపు ధర్మారావు, మల్లాడి గోపి, సాధనాల రాజాజీ, చెల్లు బాలకృష్ణ, అంగాడి రేవతి, పెమ్మాడి స్వామి, అర్థాని నాగరాజు, మల్లాడి శ్రీను, పాలెపు శ్రీను, పాలెపు ధర్మరాజు, దివి వెంకన్నబాబు, మల్లాడి ధర్మారావు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాల్లో గడపగడపకు..

కె.గంగవరం, మార్చి11: తామరపల్లి, సుందరపల్లి, సత్యవాడ, దంగేరు గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వైసీపీ నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, వైసీపీ నేయకులు రెడ్డి జయరాజ్, కొప్పిశెట్టి లక్ష్మణ్, తోకల శ్రీను, బత్తుల అప్పారావు, సలాది శ్రీను పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల సభ

పి.గన్నవరం, మార్చి 11: పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో చిన్నారుల సభ ఏర్పాటు చేశారు. ఈసభలో విద్యా సంబంధ అంశాలు, గేయాలు, పద్యాలు, నీతికథలు, దేశం, రాష్ట్రం, జిల్లాకు సంబంధించిన విషయాలు, ఇంగ్లీషు, హిందీ తదితర అంశాలను విద్యార్థులు వివరించారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పది మంది విద్యార్థుల తల్లులను సన్మానించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ వడలి కొండయ్య, ఎంపీటీసీ పులపర్తి రాజారావు, సీఎంవో పి.సుబ్రహ్మణ్యం, డీసీఈబీ బి.హనుమంతరావు, తెలుగు పండిట్ పి.శైలజ, ఉపాధ్యాయులు ఎండీ ఇస్మాయిల్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

రాయవరం, మార్చి 11: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లంతా ఎటువంటి ప్రలోభాలకు, భయానికి లోనుకాకుండా స్వేచ్ఛయుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం చెల్లూరు, వెంటూరు గ్రామాల్లో ఓటర్లతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో కేంద్ర సీఐఎస్ఎఫ్ బలగాలతో మార్చ్‌ఫాస్టు నిర్వహించారు. కార్యక్రమంలో మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌బాబు, ఎస్‌ఐ జి.నరేష్, సీఐఎస్ఎఫ్ సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా టీచర్లకు సన్మానం

రాయవరం, మార్చి 11: స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్‌లో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా టీచర్లను సోమవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో మరింత రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గ్రామసచివాలయాలు, ఆర్‌బీకేలు ప్రారంభం

ద్రాక్షారామ, మార్చి 11: యనమదలలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలను రాజ్యసభసభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంపనవీరవెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు నురుకుర్తి శ్రీరామకృష్ణమల్లేశ్వరస్వామివారిదేవస్థానం చైర్మన్ కుక్కల గోవిందు, పెయ్యల భాస్కరరావు, సచివాలయాలు సిబ్బంది పాల్గొన్నారు. హసన్‌బాదలో ఎస్సీ బీసీ సామాజిక భవనాలను ప్రారంభించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు పాల్గొన్నారు. వెంకటాయాపాలెంలో గ్రామసచివాలయాన్ని ప్రారంభించారు. సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంపీపీ అంబటిభవానీ, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరావు, ఏపీఐడీసీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, ఏఎంసీ చైర్మన్ పండుల గోవిందరాజు, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టిశ్రీదేవి, ఎంపీటీసీ కణితి వెంకటేశ్వరి పాల్గొన్నారు.